క్లుప్తంగా

కార్యదర్శులకు ఉత్తమ సేవా పురస్కారాలు



డీపీఓ కృష్ణకుమారి నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న కార్యదర్శులు

అల్లవరం: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి అంకితభావంతో విధులు నిర్వర్తించిన కార్యదర్శులకు 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవా పురస్కారాలు వరించాయి. కొమరగిరిపట్నం పంచాయతీ కార్యదర్శి ఎన్‌వీవీ సత్యనారాయణ, గుడాల కార్యదర్శి అడబాల రాజేశ్వరరావు(రాజా), అల్లవరం కార్యదర్శి రాజమోహన్, బోడసకుర్రు కార్యదర్శి దుర్గా శ్రీనివాస్‌లకు జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి ఉత్తమ సేవా పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు, సూరపరాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం



దగ్ధమైన దుకాణాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్‌సాగర్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లో ఇటీవల ఫ్యాన్సీ, కూల్ హోమ్ దగ్ధమై ఆర్థికంగా నష్టపోయిన మట్టపర్తి తాతారావుకు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ రూ.5 వేల నగదు సాయం అందించారు. బుధవారం ఆయన అగ్నికి ఆహుతైన దుకాణాన్ని పరిశీలించి బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు నందికోళ్ల శ్రీమన్నారాయణ, చిట్టూరి చలపతి, పిల్లి పరదేశరావు తదితరులున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంపై సర్వే



పశువుల్లంకలో సర్వే చేసేందుకు వచ్చిన రంగరాయ మెడికల్ కళాశాల వైద్య బృందం

ఐ.పోలవరం: మండలంలోని పశువుల్లంక గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అమలు జరిగే విధానంపై వైద్యులు బుధవారం సర్వే నిర్వహించారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి.సుజాత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రీదేవి, కోనసీమ జిల్లా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సుమలత, కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.శివగాయత్రిల ఆధ్వర్యంలో ఈ సర్వే జరిగింది. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి మెడిసిన్ పీజీ స్టూడెంట్స్, హౌస్ సర్జన్స్, పీహెచ్‌సీ సిబ్బంది బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు.

అవతార్ మెహర్‌బాబా అమరధి వేడుకలు

ఐ.పోలవరం: మండలంలోని బాణాపురంలో అవతార్ మెహర్ బాబా 55వ అమరధి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 1969 సంవత్సరంలో జనవరి 31వ తేదీన అవతార్ మెహర్‌బాబా శరీరం చాలించి భక్తుల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. పక్కవారి లోపాలను ఎత్తి చూపడం కన్నా మనల్ని మనం సంస్కరించుకోవడంలోనే గొప్పతనముందన్నారు. కార్యక్రమంలో రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, రాయపురెడ్డి సత్యనారాయణమూర్తి, రాయపురెడ్డి వెర్రిబాబు, బొరుసు హరిబాబు, దేవు చిన్న, ఉలసి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి బదిలీలు

యానాం: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ లలోని 320 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు శాఖాపరంగా బదిలీలు చేస్తూ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(హెడ్‌క్వార్టర్స్) సుభమ్‌గోష్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. యానాం నుంచి పెమ్మాడి సత్తిబాబును పీఏపీకు, కె.జగన్నాథమ్‌ను పీసీఆర్ సెల్‌కు, కట్టా సత్యనారాయణను పీఏపీకు, డి.సురేష్, కె.వెంకటరమణ, ఎం.గణేష్, ఫణికుమార్‌లను పీఎస్‌కు, బలసాడి శివను పీసీఆర్ సెల్‌కు, ప్రతాప్‌కృష్ణను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. హెడ్ కానిస్టేబుల్స్ పి.సత్యనారాయణను కోస్టల్ పీఎస్‌కు, జెబీసీ సుబ్బారావును పీఎస్‌కు, జెబీవీ స్వామి, జితేష్‌కుమార్‌లను కోస్టల్ పీఎస్‌కు బదిలీపై పంపించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఉప్పలగుప్తం: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కె.మనోహరజోషి తెలిపారు. మండలంలోని ఎస్.యానం గ్రామంలో మంగళవారం రాత్రి గస్తీ తిరుగుతుండగా అదే గ్రామానికి చెందిన పలచోళ్ళ శ్రీరామమూర్తి 48 మద్యం సీసాలు, నాలుగు బీరు సీసాలు తరలిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని, నిందితుడిని బుధవారం అమలాపురం కోర్టులో హాజరపరిచినట్టు ఎస్ఐ చెప్పారు.

ఆడబిడ్డకు కల్యాణమస్తు

- పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ భరోసా
- కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలతో లబ్ధి





ముమ్మిడివరం: ఆడపిల్ల పెళ్లంటే పేద కుటుంబాలకు ఎంత భారమో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. పెళ్లిపత్రిక ముద్రించడం మొదలు వధూవరులకు నూతన వస్త్రాలు, తాళిబొట్టు, పెళ్లి మండపం, భోజనాలు, బాజాభజంత్రీలు.. ఒక్కటేమిటి సవాలక్ష ఖర్చులుంటాయి. ఈ క్రమంలోనే పెళ్లి తంతు పూర్తయ్యేసరికి పేదింటి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. అందుకే పేదలు తమ పిల్లల వివాహాలను గౌరవప్రదంగా నిర్వహించే సామాజిక బాధ్యతకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా, మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది.

పకడ్బందీగా మార్గదర్శకాలు

రాష్ట్రంలో బాలికా విద్యను ప్రోత్సహించేలా బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేలా ఈ పథకాలను రూపొందించడం విశేషం. దీనికోసం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల్లో లబ్ధి పొందాలంటే వధూవరులు కనీసం పదో తరగతి చదివి ఉండాలన్న నిబంధన విధించారు. బాల్యవివాహాల నిరోధానికి వధువుకు 18, వరుడికి 21 సంవత్సరాలు నిండాలన్న నిబంధన విధించారు. దరఖాస్తుకు వధూవరుల ఆధార్ కార్డులు, టెన్త్ మార్కుల జాబితా, ఇద్దరి ఈ మెయిల్ ఐడీ, కుల ధ్రువీకరణ పత్రాలు, తల్లి, తండ్రి లేదా సంరక్షకుల ఆధార్ జిరాక్స్ కాపీలు, పెళ్లి ఫొటోలు, మ్యారేజ్ సర్టిఫికెట్, వివాహ పత్రిక, వివాహ సమయంలో తీసిన ఫొటోలు, దివ్యాంగురాలైతే సదరం సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది. రెండో వివాహం చేసుకునే పెళ్లి కుమార్తె తన మొదటి భర్త మరణ ధ్రువీకరణ పత్రం లేదా వితంతు పింఛన్ కార్డు జిరాక్స్ అందజేయాల్సి ఉంటుంది. నమోదు చేసిన వెంటనే అప్లికేషన్ ఐడీ నంబర్ లబ్ధిదారుల మొబైల్ నంబర్‌కు వస్తుంది. పెళ్లయిన 60 రోజుల్లోగా ఈ పథకానికి ఎన్‌బీఎం పోర్టల్‌లో దరఖాస్తు చేయాలి. దరఖాస్తు వార్డు లేదా గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌కు వెళ్తుంది. సదరు అధికారి దరఖాస్తును పరిశీలించి వధూవరుల బయోమెట్రిక్, ఈకేవైసీ తీసుకుని ప్రభుత్వ సాయం అందేలా చూస్తారు.

ఆర్థిక సాయం ఇలా..

వైఎస్సార్ కల్యాణమస్తు పథకంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులకు లబ్ధి అందజేస్తున్నారు. ఏటా నవంబరు 1వ తేదీ నుంచి జనవరి నెలాఖరు వరకూ దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరిలో, ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 30 వరకూ దరఖాస్తు చేసుకున్న వారికి మే నెలలో, మే 1 నుంచి జులై 31 వరకూ దరఖాస్తు చేసుకున్న వారికి ఆగస్టులో, ఆగస్టు 1 నుంచి అక్టోబర్ 31 వరకూ దరఖాస్తు చేసుకున్న వారికి నవంబరులో ఆర్థిక సాయం అందజేస్తారు. ఇప్పటివరకూ ముమ్మిడివరం నియోజకవర్గంలో వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద 138 మంది లబ్ధిదారులకు రూ.1.90 కోట్ల ఆర్థిక సాయం అందజేశారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారైతే రూ.1 లక్ష చొప్పున, ఎస్సీలను కులాంతర వివాహం చేసుకున్నవారికైతే రూ.1.20 లక్షలు, బీసీలకైతే రూ.50 వేలు, బీసీలను కులాంతర వివాహం చేసుకున్నవారైతే రూ.75 వేలు, మైనార్టీలకు రూ.1 లక్ష చొప్పున, మైనార్టీలను కులాంతర వివాహం చేసుకున్నవారైతే రూ.1.20 లక్షలు, దివ్యాంగులకు రూ.1.50 లక్షల చొప్పున, భవన నిర్మాణ కార్మికులైతే రూ.40 వేలు చొప్పున అందిస్తున్నారు.

> **బాలికా విద్యను ప్రోత్సహించేలా నిబంధనలు**
>
> ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు ఆర్థిక సాయం జమ చేస్తారు. బాల్య వివాహాలను అరికట్టి, బాలికా విద్యను ప్రోత్సహించేలా ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది.
>
> – జి.రాంబాబు, ఎంపీడీఓ, ముమ్మిడివరం

ఇంటింటికీ రక్షిత మంచి నీరు

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



కాట్రేనికోనలో మంచినీటి కుళాయి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: ఇంటింటికీ కుళాయిలు వేసి రక్షిత మంచినీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని టీటీడీ పాలకవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని కాట్రేనికోన, నడవపల్లి, కుండలేశ్వరం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంకులు, ఏర్పాటుచేసిన కుళాయిలను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గంలో శివారు గ్రామాలకు సైతం రక్షిత మంచి నీరు అందించాలనే ధ్యేయంతో సుమారు 100 ట్యాంకులు నిర్మించామన్నారు. తాగునీటి సమస్య అన్నది లేకుండా శాశ్వత పరిష్కారంగా దిశగా పనులు చేపట్టామన్నారు. మండలంలో ఓఎన్‌జీసీ సంస్థ సీఎస్‌ఆర్ నిధులు రూ.34 లక్షలతో కాట్రేనికోన మెయిన్‌లో, రూ.27 లక్షలతో వెంకమ్మ చెరువులో, రూ.35 లక్షలతో నడవపల్లిలో, రూ.41 లక్షలతో కుండలేశ్వరంలో, జల జీవన మిషన్ నిధులు రూ.24 లక్షలతో పెనుమల్లెలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులను ఆయన ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో కాట్రేనికోన, రూ.23 లక్షలతో నడవపల్లిలో, రూ.44 లక్షలతో కుండలేశ్వరంలో ఏర్పాటుచేసిన పైపులైనులను ప్రారంభించారు. లక్ష్మీవాడలో పాఠశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, సర్పంచులు గంటి వెంకట సుధాకర్, దొమ్మేటి పల్లవి, గోకరకొండ వీరవెంకట గౌరీసుబ్బలక్ష్మి, చొల్లంగి శ్రీలక్ష్మి, పాలెపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, సానబోయిన ఏసు, ఏడిది చక్రపాణిరావు, నల్లా నరసింహమూర్తి, ఏడిది సుబ్బు, నల్లా బేబి జానకి, నాతి సత్యనారాయణ, అలివేణి, సంసాని నాగేశ్వరరావు, మల్లాడి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ నాయుడు సేవలు అభినందనీయం



కమిషనర్ నాయుడు దంపతులను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణాభివృద్ధి కోసం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అన్నారు. మూడు సంవత్సరాల మూడు నెలల పాటు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి ఎన్నికల బదిలీల్లో భాగంగా విశాఖ మహా నగరం జోనల్ కమిషనర్‌గా బదిలీ అయిన అయ్యప్పనాయుడికి స్థానిక కౌన్సిల్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక కౌన్సిల్ హాలులో మంగళవారం రాత్రి జరిగిన వీడ్కోలు సభలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి మాట్లాడారు. పాత కమిషనర్ నాయుడికి వీడ్కోలు పలుకుతూ కొత్త కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.మనోహర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ నాయుడు దంపతులను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, చిత్రపు రామకృష్ణ, చిట్టూరి పెదబాబు, దొంగ నాగసుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ధర్మపోరాట యాత్ర



ఓఎన్‌జీసీ పరిహారం చెల్లించాలంటూ మత్స్యకారులు నిర్వహిస్తున్న ర్యాలీ

యానాం: యానాం నియోజకవర్గ మత్స్యకారులకు మంజూరుచేసిన ఓఎన్‌జీసీ నష్టపరిహారం సొమ్మును బాధిత మత్స్యకారులకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసు వద్ద మత్స్యకారులు ధర్మపోరాట యాత్ర పేరుతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ గోదావరిలో ఓఎన్‌జీసీ సంస్థ మంజూరుచేసిన సొమ్మును ప్రభుత్వం గత 24 నెలలుగా లబ్ధిదారులకు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పక్కనే ఉన్న ఆంధ్రా మత్స్యకారులకు ప్రభుత్వం ఇప్పటికే నాలుగు విడతలుగా సొమ్ము పంపిణీ చేసిందన్నారు. బీసీ రాష్ట్ర నేత మల్లాడి సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. మత్స్యకార నాయకుడు మల్లాడి భైరవస్వామి మాట్లాడుతూ పరిహారం పంపిణీ చేయకపోతే పుదుచ్చేరి అసెంబ్లీ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో అరదాడి పోషియ్య, లంకే జాన్, మల్లాడి రవి,కర్రి పేరియ్య, గుత్తుల రామారావు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, పండు సిద్దార్థకుమార్, దుగ్గదుర్తి అనిత పాల్గొన్నారు.

ఎంపీడీఓ అనుపమకు సత్కారం



ఎంపీడీఓ అనుపమను అభినందిస్తున్న ఎంపీపీ సునీత, ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ తదితరులు

తాళ్లరేవు: ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ మట్టపర్తి అనుపమను ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పలువురు అధికారులు సత్కరించి అభినందించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఎంపీడీఓ అనుపమను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ ఎంపీడీఓగా అనుపమ తక్కువ కాలం పనిచేసినా అందరి మన్ననలు పొందారన్నారు.

ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మాట్లాడుతూ గోదావరికి వరదలు వచ్చినపుడు చంటిబిడ్డతోనే ఆమె అందించిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు యర్రంనీడి అప్పారావు, పోతుల రత్నకుమారి, రత్స ముత్యాలు, ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, మండల పరిషత్ ఏఓ చింతా మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజేతలకు సత్కారం



ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో రాణించిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ఐ.పోలవరం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చాటిన స్థానిక క్రీడాకారులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఐ.పోలవరం మండలం నుంచి వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ విభాగాల్లో బాలికలు ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విజేతలకు సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, సొసైటీ చైర్మన్ విత్తనాల శ్రీనివాసరావు బహుమతులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీధి సురేష్‌బాబు, గ్రామ పెద్దలు పాఠశాల సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, పాఠశాల పీడీలు పోతుల సురేష్‌బాబు, వర్గాల రవికుమార్, పాఠశాల అభివృద్ధి కమిటీ మెంబర్ రాయపురెడ్డి బాబి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: వాకర్స్ హెల్త్ క్లబ్ నూతన కార్యవర్గం స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రీక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం రాత్రి ప్రమాణ స్వీకారం చేసింది. డీఎస్పీ అంబికా ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. నూతన కార్యవర్గం చేత వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా బోణం సత్యవరప్రసాద్, కార్యదర్శిగా వలవల వీఆర్ నాయుడు, కోశాధికారిగా పచ్చిగోళ్ల చిన రామస్వామి, ఉపాధ్యక్షుడిగా రంకిరెడ్డి కాశీతో పాటు 19 మంది కార్యవర్గ ప్రతినిధులుగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. క్లబ్ నూతన అధ్యక్షుడు సత్య వరప్రసాద్ అటు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా, బులియన్ అసోసియేషన్ ప్రతినిధిగా మూడు సంస్థల్లో త్రిపాత్రాభినయం చేస్తున్నారని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని వాకర్స్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, సప్పా నాగేశ్వరరావు, పి.జాన్‌పాల్, డాక్టర్ గంధం రామం, పంచాయితీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు తదితరులు అభినందించారు.

బండారులంక కార్యదర్శి చేగొండి మృతి



కార్యదర్శి చేగొండి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీపీఓ కృష్ణకుమారి తదితరులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామ పంచాయతీ కార్యదర్శి చేగొండి సత్యనారాయణమూర్తి(57) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో కామనగరువు, ఈదరపల్లి, ఇందుపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శిగా సేవలందించిన ఆయన ప్రస్తుతం బండారులంక పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. డీపీఓ కార్యాలయం వద్ద జరిగిన సంతాప సభలో సత్యనారాయణమూర్తి చిత్రపటానికి డీపీఓ కృష్ణకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో డీఎల్పీఓలు బొజ్జిరాజు, రామకృష్ణారెడ్డి, ఈవోపీఆర్డీ మల్లిఖార్జునరావు, రుద్రరాజు, ఎస్ఎస్ సూరపరాజు, కార్యదర్శులు రాజా, రెడ్డి శిరీష, జీఎస్ నారాయణరావు, సింగంపల్లి శ్రీనివాస్, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

యువత శక్తి సామర్థ్యాలపైనే దేశ ప్రగతి



రామ్మోహనరావును సత్కరిస్తున్న డీఎస్ఎన్ రాజు, కుమార్ శాస్త్రి

అమలాపురం రూరల్: యువతరం శక్తి సామర్థ్యాలు, సాంకేతిక నైపుణ్యాల మీదే దేశ ప్రగతి ఆధారపడి ఉంటుందని ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్, క్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అన్నారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ కుమార్ శాస్త్రి అధ్యక్షతన బుధవారం 'రిఫామ్స్ ఇన్ హైయిర్ ఎడ్యుకేషన్ – అన్ లెషింగ్ యూత్ ప్రొటన్షియల్ ఇన్ ఏపీ' అనే అంశంపై కార్యక్రమం జరిగింది. రామ్మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యలో సంస్కరణలు – యువత సామర్థ్యం ఆవిష్కరణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. డిగ్రీ, పీజీ చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందడానికి ఆ కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. జగనన్న విద్యా దీవెన, జగనన్న విదేశీ విద్య, వసతి దీవెన, నాలుగు సంవత్సరాల హానర్స్ డిగ్రీ, 10 నెలల ఇంటర్న్‌షిప్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, స్టేట్ రీసెర్చ్ బోర్డ్ ప్రోగ్రామ్‌లు, ప్రాజెక్ట్ మానిటరింగ్, యూనిట్ ప్లేస్‌మెంట్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలపై అవగాహన కలిగించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ కుమార్ శాస్త్రి మాట్లాడుతూ అంకితభావం, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు డాక్టర్ ఎస్ఎన్‌రాజు, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణ కిషోర్, కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు ప్రసంగించారు. అనంతరం రామ్మోహనరావును ప్రిన్సిపాల్ కుమార్ శాస్త్రి సత్కరించారు.

సీఎం రంగసామిని కలిసిన ఎమ్మెల్యే అశోక్



సీఎం రంగసామిని కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గంలో ఓఎన్‌జీసీ సంస్థ చమురు కార్యకలాపాల వల్ల తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులకు సంస్థ మంజూరుచేసిన నష్ట పరిహారాన్ని విడుదల చేయాలని సీఎం రంగసామిని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. బుధవారం పుదుచ్చేరి అసెంబ్లీ సెక్రటరియేట్‌లో సీఎం రంగసామిని ఆయన స్వయంగా కలిసి మత్స్యకారుల పరిహారం పంపిణీపై ప్రధానంగా చర్చించారు. మత్స్యకారులకు చెందాల్సిన పరిహారం సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో తక్షణం వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. లబ్ధిదారుల శ్రేయస్సే ప్రధానంగా మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. దీనికి స్పందించిన సీఎం రంగసామి మట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల కంటే ముందుగానే మత్స్యకారుల పరిహారం చెల్లించేలా సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు



సత్కారం పొందిన జేఈ వెంకన్నబాబు దంపతులు

యానాం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించడం ద్వారా ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో 37 ఏళ్ల పాటు సేవలందించి జూనియర్ ఇంజినీరుగా ఉద్యోగవిరమణ పొందిన కొప్పిశెట్టి వెంకన్నబాబును సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంజినీరుగా వివిధ నిర్మాణాల పర్యవేక్షణలో వెంకన్నబాబు చేసిన కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏఈ దారా సుబ్బరాజు, ఏఈ నాగరాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించాలి



ఎస్.యానంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ నుపూర్ అజయ్

ఉప్పలగుప్తం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నవరత్నాల్లో భాగంగా అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్‌తో అందించాలని జేసీ నుపూర్ అజయ్ ఆదేశించారు. మండలంలోని ఎస్.యానం గ్రామంలో మెదలైన జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో కలిసి జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్లలో ఎదరయ్యే సాంకేతిక లోపాలను సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలో 118 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను గుర్తించామని, వీరికి రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయి రిజిస్ట్రేషన్ చేసి వారికి అందజేస్తామని తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, వీఆర్వో రామంలు పాల్గొన్నారు.

రైల్వే అలైన్‌మెంట్ పూర్తి చేయండి



దిండిలో రైల్వేలైన్ వెళ్లే భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవవర్దనరెడ్డి

మలికిపురం: కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్ అలైన్‌మెంట్ త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్డీఓ జి.కేశవవర్దన్ రెడ్డి అధికారులకు సూచించారు. దిండి, మేడిచర్లపాలెం, గుడిమెళ్లంక, మట్టపర్ర గ్రామాల్లో రైల్వే లైన్ వెళ్లే భూములను ఆయన బుధవారం పరిశీలించారు. అధికారులతో కలిసి ఆయన రూట్ మ్యాప్ పరిశీలించారు. తహసీల్దారు జీవీఎల్ నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన చెప్పిన వివరాల ప్రకారం యానాం, కపిలేశ్వరపురాలకు చెందిన బి.దుర్గారావు, నూకరాజులు 470 మద్యం సీసాలను తరలిస్తూ అరటికాయలంక చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డారు. వారిద్దరినీ అరెస్ట్ చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురికి రిమాండ్

యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు కోర్టు రిమాండ్ విధించినట్లు కోరంగి ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ నెల 29వ తేదీన అరటికాయలంక చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన దాడుల్లో 1680 మద్యం సీసాలను తరలిస్తూ సంగాడి శ్రీను, మల్లాడి శ్రీను, సంగాడి వీరబాబు అనే వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ చెప్పారు.